# ఆంధ్ర మహా సావిత్రి



శ్రీ శార్వరి

# 1. మహోదయం

ఎక్కడో కథ మధ్యన వచ్చే క్లైమాక్స్‌తో 'సావిత్రి' మహాకావ్యం ఆరంభమైంది. మరుక్షణంలో గతం 'ఫ్లాష్ బ్యాక్' అవుతుంది. అది సత్యవంతుడు మరణించవలసిన రోజు. అంటే నారదమహర్షి పెట్టిన గడువు ఆ రోజుతో పూర్తి అవుతుంది. సత్యవంతుడు సకల సద్గుణ వల్లభుడు. అయినా అల్పాయుష్కుడు. అతను ఒక్క ఏడాదిమించి జీవించడని చెప్పాడు నారదుడు. అయినా సావిత్రి అతనినే వరించింది. ఆ రోజుకోసం నిరీక్షించసాగింది. ఆరోజు రానే వచ్చింది. వరించింది.

అది పరమాత్మ జాగృతం కాని 'బ్రాహ్మీ' ముహూర్తం.

రాత్రి గడుస్తున్నది. ఉషోదయం కానున్నది. ఆమెకు మూడు దినాలుగా కంటిపై కునుకులేదు. త్రైరాత్ర వ్రతం చేస్తున్నది. సావిత్రి మద్ర ప్రభువు అశ్వపతి కుమార్తె. రాజ్యభ్రష్టుడై అరణ్యవాసం చేస్తున్న ద్యుమత్సేనుని కుమారుడు సత్యవంతుని ఏరికోరి స్వయంవరం చేసుకున్నది. అత్త మామలతో, భర్తతో కలసి అరణ్యంలో కాపురం పెట్టింది. సావిత్రీ సత్య వంతులది ఆత్మ ప్రణయబంధం. ఏడాదికాలం సుఖంగానే సంసారం సాగింది. సత్యవంతునికి అవసానకాలం సమీపిస్తున్నదని సావిత్రికి తెలుసు. అదే ఆమె కలవరం. అటు ఆసన్న మృత్యువుపై దృష్టి కేంద్రీకరించింది.

అక్కడ జీవి ఆరాటం చిత్ర విచిత్ర సంకేతమయం. సం వేదనామయం. దానిలోకి చొచ్చుకుపోవడం దుస్తరం, అనూహ్యం. అక్కడక్కడ శూన్యంలో మెరుపుల మిణుగురులు, ఒక రూపం ఏదో అరూపంగా తోచి అంతలో మాయమవుతుంది. ఒక్కొక్క అరూపభావన, రూపచిత్రమై ఆకాశమంత విశాలంగా విస్తరిస్తుంది.

మొదట దర్శనమయ్యేది నిశీథం. గాఢాంధకారం. రాత్రి అంతా అలముకున్న చీకట్లు వేరు, ఉషస్సుకు ముందర ముసిరే తమస్సు వేరు.

కన్నుపొడుచుకున్నా కనిపించని చీకటి ఉషోదయానికి ముందరగా అలముకుంటుంది.

ఆ నిబిడాంధకారాన్ని చీల్చుకుని ఉషోరేఖలు ప్రసరిస్తాయి. ఉషోదయంలో చీకట్లు విచ్చుకుంటాయి.

అది ఉషోదయం ... మనిషి ఎదలో కలిగే చైతన్యం. ఉషఃకాంత మత్తు వదిలించుకుని దివ్యత్వాన్ని ఆలింగనం చేసుకున్నది. మనస్సు అజ్ఞానం వదలి, అంధకారం నుండి క్రమంగా బయటపడి, వెలుగు నింపుకుని పరిణామంలో చివరకు దివ్యం కావాలి. ప్రతి ఆత్మ పరమాత్మ స్థాయికి ఎదగాలి. అణువు బ్రహ్మాండం కావాలి.

మనిషి మేలుకొంటున్నాడు. మానవత నిద్ర నుండి బయటపడుతోంది. నిత్యకృత్యాలు జరుగుతున్నాయి. సావిత్రి మనసు శరీరంలో లేదు. రానున్న ఆపద గురించి క్షోభిస్తోంది. ముఖంపైన చెదరని దరహాసం, అంతరంగంలో కల్లోలం, అలజడి. ముఖంపైన చెదరని దరహాసం – అమృతత్వాన్ని కాంక్షించే వారికది మహోదయం. స్వర్గం చేరాలన్నా పరమాత్మను చేరాలన్నా అంత సులభం కాదు.

సావిత్రి రాకుమారిగా, తండ్రిచాటుబిడ్డగా ఉన్నంతకాలం రాజభోగాలు అనుభవించింది. స్వయంవరంతో సత్యవంతుని పెండ్లాడి, కష్టాలు కోరి తెచ్చుకున్నది. ప్రేమ కోసం, విజయం కోసం, ఆత్మవిముక్తి కోసం, దివ్యత్వం కోసం, అమృతత్వం కోసం ఆమె జన్మించింది. ఆమె జగన్మాత అంశ. సత్య వంతుడు 'సత్య' ప్రతినిధి. 'సత్యం' మొదట మృత్యువాత పడ్డది. అజ్ఞానంలో చిక్కుకున్నది. సావిత్రి తన ప్రేమతో సత్యాన్ని జయించి అగ్నిపునీత అయింది. ఆత్మజ్ఞానంతో సత్యాన్ని దర్శించడమే మానవ జీవిత పరమావధి.

అది సావిత్రికి ముంచుకొస్తున్న మృత్యువుకు మధ్య కాలపరీక్ష. మృత్యువుకు, దివ్యజీవనానికి మధ్య తలెత్తిన సమస్య. జీవునికి బ్రహ్మజిజ్ఞాసకు మధ్య జటిల సమస్య. అది సావిత్రికి ఉషోదయం ... జగతికి మహోదయం. మరికొద్ది క్షణాలలో సావిత్రి మృత్యువును దర్శిస్తుంది. యముని ఆగమనం ఆమె జీవితంలో క్లిష్టమైన ఘడియ. తన కర్తవ్యాన్ని విస్మరించి మృత్యువుకు తలవంచడం అన్న ప్రశ్నే లేదు. అప్పుడు సావిత్రిలో దివ్యాంశ ప్రవేశించింది. ప్రాపంచిక బంధాల నుండి మానవత్వాన్ని ఉద్ధరించాలన్న పట్టుదల

# ౬. ఆశయం

మనిషి ఎంతో విజ్ఞానం సాధించాడు. సంస్కృతిని, నాగరికతను అలవరచుకున్నాడు. మరెన్నో వైజ్ఞానిక విజయాలు సాధించుకున్నాడు. శాస్త్రీయ దృక్పథం అలవరచుకున్నాడు. అశ్వపతి విజ్ఞానఖని. ఆర్జిత విజ్ఞానం అంతా అతనికి తెలుసు. శాస్త్రీయ విజ్ఞానం మనస్సుకు లోబడేది. ఆత్మ సంపాదించేది జ్ఞానం. అది ప్రజ్ఞానం.

యోగంతో పూర్ణత్వం సాధించాలని అశ్వపతి తలపోత. పరిణామానికి యోగం సహకరిస్తుంది. ప్రగతి సాధనకు విజ్ఞానం పనికొస్తుంది. అశ్వపతి త్రికాలజ్ఞానం పొందాడు. గతంలోకి వెళ్లగలడు. భవిష్యత్తులోకి చూడగలడు. బాహ్య ప్రపంచాన్ని దర్శించగలడు. అంతర్లోకాలను వీక్షించగలడు. భౌతిక, మానసిక, ఆత్మిక భూమికలలో పయనించసాగాడు. భౌతిక మానసిక శరీరాలను విడిచి, ఆత్మ శరీరంతో ప్రజ్ఞతో ప్రయాణించసాగాడు. అతనికి స్థూల శరీరం ఎంత ముఖ్యమో, సూక్ష్మ శరీరం అంతకంటే ముఖ్యం. తమో మండలాలు ఎంత ఇష్టమో తేజో మండలాలూ అంతే ప్రీతికరం. చీకట్లను చీల్చగలిగినప్పుడే వెలుగు కనిపిస్తుంది. అజ్ఞానం వదలినప్పుడే జ్ఞాన జ్యోతి దర్శనమవుతుంది.

అశ్వపతి అవరోధాలకు క్రుంగిపోలేదు. సత్యాన్ని తెలుసుకోవాలన్న పట్టుదల. దివ్యత్వాన్ని శాశ్వతంగా తనలో నిలుపుకోవాలన్న తపన. తానొక్కడే కాకుండా ప్రతి ఒక్కరు దివ్యజీవనం గడపగలగాలి. ఆ ప్రయత్నంలో అంతా చీకటి. దారీ తెన్నూ కనిపించలేదు. మళ్లీ యోగం చేశాడు. కొంత నిర్వేదం, నిరుత్సాహం, శూన్యం. లోకపు ఎల్లలు దాటిపోగలిగాడు. దివ్య లోకాల పొలిమేరలు చేరుకున్నాడు. అదొక లోకం. అదే తాను ఆశించిన దివ్యలోకం. ఆ లోకాన్ని భూమిపైన ప్రతిష్ఠించాలని, అందుకు అవకాశం యిమ్మని పరమాత్మను అర్థించాడు.

**ప్రపంచం** ఇవ్వగలిగిన సంపదలన్నీ అత్యల్పం. విజ్ఞానం, పాండిత్యం, శక్తి – కాలంతో సన్నబడి హరించిపోతాయి. అవి ఏవీ మనిషి ఆత్మకు శాంతి కలిగించవు. తృప్తి నివ్వవు. తృష్ణను తీర్చవు. పూర్ణ రూపాలన్నీ పరమాత్మ రూపాలే అయినా మన జీవితాలు పరమాత్మకు కట్టుబడి ఉన్నా, రూపధారణ వల్ల అవి పరమాత్మను చేరవు. పరమాత్మ సైతం వాటిని తనవిగా భావించడు. శుద్ధ ఆత్మ ఒక్కటే పరమాత్మకు ప్రీతికరం. ఆత్మసాక్షిగా అది ఒక్కటే సత్యం. స్వయంకృతాపరాధం వల్ల పరమాత్మ జాడ తెలియదు. తెలిసినా మనకు అందనంత దూరాన ఉంటుంది. అందుకే దానిని అగమ్యం, అగోచరం, నిర్గుణం, నిరాకారం అంటాం.

లోకానికే అందాల్ని అందించిన పరమాత్మ సౌందర్యం మనకు కనిపించదు, తెలియదు. ఈ లోకం మహత్తులు కోల్పోయిన సిద్ధుని వలె, ప్రియుడు వదిలి వెళ్లిన అభిసారిక వలె నిర్జీవంగా, కళారహితంగా మిగిలింది. లక్ష్యం కోల్పోయిన ప్రపంచం శూన్యంతో సమానం. శూన్యంగానే బ్రతుకుతున్నట్లు. జ్ఞానం కోసం అన్వేషణ ఉత్తి మానసిక శ్రమ అనిపిస్తుంది. యావత్ భౌతిక విజ్ఞానం అవ్యక్తంలో అంతరిస్తుంది. యావత్ జ్ఞానం శూన్యం నుండి ప్రభవిస్తుంది. మనిషి కష్టించి సాధించిన విజ్ఞానం అహంకారాన్ని పెంపొందిస్తుంది. కాలం ఆ విజ్ఞానాన్ని రద్దు పరుస్తుంది. అన్ని ప్రాకృతిక శక్తులు ఈశ్వరీయతలో లీనమైపోతాయి. ఒక చీకటి గుహలో దివ్య వర్చస్సు రక్షింపబడుతూ ఉంటుంది.

అశ్వపతి అన్వేషణకు అంతం లేదు. తపన అనంతంగా సాగుతున్నది. వేదనా హృదయంలో నిశ్శబ్దం నెలకొన్నది. ప్రాపంచిక వాంఛల నుండి, వేదనల నుండి నిర్గమించి పరమాత్మ పిలుపుకు ఎదురు చూడసాగాడు. అజ్ఞాతంగా అతి సన్నిహితంగా వున్న జీవాత్మ సచ్చిదానందాన్ని ప్రశాంతిని అనుభవిస్తున్నా, ఇంకా పొందవలసింది, పొందదగింది ఎంతో ఉన్నదని ఆత్మకు అనిపిస్తోంది. పరం తనకు అందినట్లు అనిపించినా ప్రలోభపెట్టి అంతర్ధానమవుతుంది. అది కోరనప్పుడు దగ్గరవుతుంది. కోరినప్పుడు దూరమవుతుంది. అది అందించే అనుభూతి తప్ప మరేదీ ఆత్మకు ఆనందం కాదు. ఆ స్పృహ లేనప్పుడు మహా

# 9. వరప్రసాదం

అశ్వపతి హృదయం ఒక రంగస్థలం. అందులో అశ్వపతి, పరమాత్మ, జగన్మాత పాత్రలు. వీరికి రూపాలు లేవు. అశ్వపతి హృదయమే మూడు పాత్రలను పోషించిందా! కాకపోవచ్చు. అదే మూడు భావాలను ప్రతిబింబిస్తుంది. అద్దం ఒక్కటే. ఎవరు ఎదురుగా నిలబడితే వారి ప్రతిబింబం కనిపిస్తుంది. ఇక్కడ బింబ ప్రతిబింబాలు లేవుగానీ, పాఠకుల సౌలభ్యం కోసం అలా భావించాలి. అన్నీ భావనలే.... అన్నీ ఫీలింగ్స్.

ఈ భావ స్పందనలు యోగి హృదయానికే అందుతాయి. 'సావిత్రి' అసలు ప్రారంభం ఇక్కడ. స్పందన, అనుభూతి, అనుభవం కలగలిసిన సమాధిస్థితి. సమాధి చైతన్యం ఇది. ఇవి బయటకు కనిపించేవి కావు. హృదయం లోపలి స్పందనలు, ఆత్మానుభూతులు. అశ్వపతి తన లోపలికి వెళ్లిన తర్వాత ఈ పరిణామం సాధ్యమైంది. ఇప్పుడు అతనిది బ్రహ్మానంద స్థితి. శరీరం, మనస్సు, ఆత్మ ఒక రేఖపైకి వచ్చి చేరాయి. మూడూ కలసి పోయాయి. ఒకదానిలో ఒకటి లీనమైనాయి. అతనిది తేజోరూపం. అతనిది తేజశ్శరీరం.

మనిషి మృత్యువును జయించాలి. భూమి మృత్యుభయం నీడ వదిలితే తప్ప దివ్యత్వం పొందలేదు. భూమి స్వర్గంగా మారాలంటే దివ్యత్వం భూమిపైన అవతరించాలి. నలు దిశలా దివ్యత్వం పరుచుకోవాలి. అశ్వపతి నవ్యసృష్టిని వాంఛించాడు. జగన్మాతను ప్రసన్నం చేసుకొని తన ప్రార్థన వినిపించాడు. ఆమెను పృథ్విపై అవతరించమని, జగతిని, మానవతను ఉద్ధరించమని వేడుకున్నాడు. లోకంలో అవతరించడానికి జగన్మాత అంగీకరించింది. జగన్మాత యిచ్చిన హామీతో అశ్వపతి తిరిగి ప్రాపంచిక స్పృహలోకి వచ్చాడు. భౌతిక ప్రజ్ఞ పొందాడు. తనది కల కాదు. ప్రపంచంలోకి తిరిగి వచ్చినా తనలో దివ్యస్ఫూర్తి ఉంది. దివ్యత్వాన్ని తన వెంట తెచ్చుకున్నాడు.

**అప్పుడు** అశ్వపతిలో అకస్మాత్తుగా ఒక దివ్య స్పందన కలిగింది. అది మహాశూన్యంలో నిర్జీవ నిశ్శబ్దం నడుమ అతి గంభీర ఏకాంతంలో పరిచయమైన అడుగుల చప్పుడు. అది నిశ్శబ్దం నుండి వెలువడిన శబ్దంలా, నాదంలా కదలి, స్పందనై అంతరంగంలోని ఆత్మను జాగృత పరచినట్లయింది. ఆ చైతన్య స్పర్శకు అతనిలోని ప్రత్యణువు ఆనందంతో పులకరించింది. అది భౌతిక పరిధిని చేరుకోగా, అధిభౌతిక ప్రజ్ఞ అతని హృదయంలో ప్రవేశించింది. మార్మిక శక్తులు అతని భౌతిక శరీరాన్ని లోబరచుకున్నాయి.

ఆ హృదయ స్పందన నిశ్శబ్దాన్ని ఛేదించింది. ఆ అనుభూతితో మనస్సు, శరీరం ఏకమై అవ్యక్త పరమానందంలో ఓలలాడాయి. మనస్సు, శరీరం, జీవం తన్మయత్వంలో కరిగిపోయాయి. అమృతపానంతో మత్తెక్కిన ప్రకృతిని మమతాను రాగాలు దరిచేరాయి. ప్రకృతిలో సైతం ఒక ప్రేమ స్పందన, ఒక రసానుభూతి మొలకెత్తింది. ఆ మధురిమలు మెరుపులై, వెలుగులై అమృత వర్షంలో పునీతమైనాయి. అది చంద్రుని చేరాలన్న సాగర తరంగ ఉద్విగ్నత.

అశ్వపతి నరనరాన అమృతం ప్రవహించసాగింది. శరీరంలోని ప్రత్యణువు చైతన్యం నింపుకుంది. గుండెలో ఆనంద జ్వాలలు మెత్తగా మండసాగాయి. రక్త మాంసాలు సైతం మాధుర్యాన్ని నింపుకున్నాయి. శూన్యంగా ఉన్న హృదయ కుహరాలు ఆనందపూర్ణాలైనాయి. జగన్మాత పద కంకణ నిక్వాణం జగతిని మేల్కొల్పింది. ఆనంద పారవశ్యంలో జగతి స్వాగత గీతిక లాలపించింది. అశ్వపతి శరీరం జడమై, మనస్సు నిశ్చలమై, ఆత్మ ప్రశాంతమైనా అతని హృదయం జగన్మాత శక్తికి ప్రతిస్పందించసాగింది.

తాను అన్వేషిస్తున్న బ్రహ్మం తనలోనే ఉన్నాడు. ఆ పరబ్రహ్మ జ్వాలా స్నిగ్ధ దివ్య సుందర విగ్రహం ఆత్మకు సాక్షాత్కరించింది. పెదవులు ఏవేవో మంత్రాలను ఉచ్ఛరిస్తున్నాయి. ఉపాసిస్తున్నాయి. కనురెప్పలు జ్ఞానపత్రాలై భారంగా వాలి పోతున్నాయి. తాను చలువరాతి విగ్రహంవలె నిగ్రహంతో ఉండిపోయి ఏకాగ్ర దృష్టితో, సాగరగర్భ గంభీరంతో అర్ధ నిమీలితంగా అంతర్దృష్టితో హృదయాకాశం

# 14. స్పందన

**సావిత్రీ సత్యవంతులు కలుసుకునే సమయం ఆసన్నమైంది. అందుకు రంగం సిద్ధమైంది. అది విధి. జగత్తులో అన్నీ పరమాత్మ నిర్ణయం మేరకే జరుగుతాయి. పరమాత్మ నిర్ణయాలు కొన్ని ఆదేశాలు, కొన్ని సందేశాలు. వారిరువురు కలుసుకున్న ఆశ్రమ భూములు తపోవనాలు. అవి ప్రశాంతికి నెలవులు. ఆత్మకు ఆవాసాలు. ఇహపరాలకు సంగమాలు. భూమి, స్వర్గం కలిసే చోటులు. సౌందర్యం, సత్యం ఒకటయ్యే దివ్యక్షణాలు. అవి ఏకాంత వాసానికి అనువైన వనాలు. అమర సుఖాలు అనుభవించగల క్షేత్రాలు. సావిత్రి అన్వేషణ ఫలించింది. సత్యం ఒడిలో ప్రేమ సేద తీరింది. ప్రేమ అనురాగాన్ని పెనవేసుకుంది.**

**ముహూర్తం** ఆసన్నమైంది. సావిత్రి గమ్యం చేరుకుంది. అలవోకగా తాను చేరవలసిన చోటుకు వచ్చిచేరింది. సర్వం పరమాత్మ స్వరూపమే, అయినా విధి మనుషులపైన అజ్ఞానం ముసుగువేసి అంధకారంలో ముంచుతుంది. అవకాశాలను వక్రీకరిస్తుంది.

అది విధి సయ్యాట. అన్నింటిలోను సమంగా ఉన్న శక్తి మన పనులలోనూ కనిపిస్తుంది. ప్రతి క్రియలోనూ తొంగిచూస్తుంది. ఈ మహానాటకంలో, నియమిత సమయంలో, ప్రతి ఒక్కరిలో ఆ పని జరిగి తీరుతుంది.

అది కరుణకు, ఆనందానికి ఆటపట్టు. మంద మలయ సమీరం. అది ప్రమోదానికి ఆకరమైన స్వతంత్ర ప్రపంచం. గ్రీష్మం, వసంతం కలబోసినట్లు అక్కడ ప్రేమ, అనురాగం పెనవేసుకుని పరవశిస్తాయి.

ఆశావిహంగం రెక్కలు విదిల్చినట్లు, ఆత్మ ఆకసాన్ని చీల్చుకుని భూమికి దిగివచ్చినట్లు, రానున్న పరిణామానికి ఆమె ఆత్మ పులకించింది. స్వాప్నిక విరహాలను విరజానందాలతో రంగరించి కాలానికి, విధికి కట్టుపడని ఆత్మకు

తలవంచి, పరమాత్మ సన్నలలో విస్తరించిన స్వచ్ఛంద సౌందర్యాలను తిలకించింది, అంబరచుంబితాలైన హిమన్నగాల రణోత్సాహం స్వర్గం. అమరవీరుల పాదాల క్రింద భూమి నలిగిపోయింది.

పర్వత సానువులలో పెరిగిన మహావృక్షాలు నిశ్చింతగా నిద్రిస్తున్నాయి. కొండలనుండి పారే సెలఏరుల జలధారలు ముత్యాల సరాలు. ఆ అరణ్యంలో కదిలే ప్రతి ఆకులోను ఆనందోద్వేగం, మలయపవన మాధుర్యం. తమలో నింపుకున్న నికుంజాలు, పరిమళభారంతో బరువెక్కి మత్తిల్లిన కుసుమ పరాగాలు, బారులు తీరిన శాబకాలు స్వాగతించాయి.

నేలపైన పురివిప్పిన మయూరాలు, చెట్లపైన గొంతు విప్పిన కోయిలలు ఆహ్వానం పలికాయి. పావురాల కువకువలు, సరోవరాల విహరించే రాయంచలు రమ్మని పిలిచాయి. ప్రియాతిప్రియమైన స్వర్గాలింగనంలో వసుంధర మైమరచింది. ప్రియకాంతుని కంటికి కనిపించకుండా ఆమె అందాలను రహస్యంగా దాచుకుంది.

ఆమె ఆనందపారవశ్యంలో పులకించి, రసార్ణవంలో మునిగిపోయింది. గొంతులో కళ్యాణరాగాలు పలికించింది. ఇంతకాలం జీవితం నిరర్థకంగా సాగింది, వలపు సుగంధాలు గాలిలో కలిసిపోయాయి. వంపుసొంపులు వలపువయ్యారాలు అడవికాచిన వెన్నె లైనాయి.

ఇప్పుడు ఎటుచూచినా వలపు వసంతం, ప్రతి ఊర్పులో గగుర్పు. ఆమె ఆత్మావలోకనంలో పరిసరాలను గమనించింది. హృదయం భావోద్రేకంతో పరుగుతీసింది. లోపలి మమతలు, అనురాగాలు పురివిప్పుకున్నాయి. ఆమె ఆమోదాలు ప్రమోదాలై, చూపులు ఇంద్రజాలాలై హృదయాన్ని దివ్య పారవశ్యంతో నింపాయి. ప్రేమమందిర కవాటాలు భళ్లున తెరచుకున్నాయి. ఆత్మశాంతి నల్దిశలా విస్తరించి హృదయం ప్రశాంతమైంది. ప్రకృతి ఒడిలో సృష్టి ఆదమరచింది.

మనిషి భావుకుడు, ఆలోచనాజీవి కనుక ప్రశాంతంగా జీవించలేడు. ఎప్పుడూ శాంతిని వెతుక్కుంటూ పరుగులు తీస్తాడు. తనలోనే ఉన్న ఆత్మను, శాంతిని విస్మరిస్తాడు. ఆత్మశాంతిలో భావం ఉండదు. శ్రమ ఉండదు. పరిశ్రమ ఉండదు. అంతా నైర్మల్యమే. జీవితం ఒక పరిధిని దాటిపోదు. జీవి తన లక్ష్యాన్ని చేరదు. ప్రశాంతిలోనే జగన్మాత విశ్రమిస్తుంది. అంతా ఆ జగన్మాత సంకల్పమే. సహకరించడంలోనే మనిషి ప్రజ్ఞ.

# 19. యోగవిభూతి

నారదమహర్షి భవిష్యత్తు గురించి భయపెట్టినా సావిత్రి సత్యవంతునే వివాహ మాడదలచింది. అది విధి లిఖితం అనికాదు. విధిని తప్పించుకొను వీలున్నదని సావిత్రికి తెలుసు. మానవకాంతగా విధిని కాదనలేదు. తల్లిదండ్రుల్ని వదలి ప్రియుని చేరింది. అరణ్యావాసం ... ఆశ్రమజీవితం. తనలోని దివ్యాంశను మరచి ఒక సామాన్య యువతిగా గార్హస్థ్య జీవితం సాగించింది.

హృదయం మహర్షి మాటల్ని మరచిపోనీయటం లేదు. ఆ రహస్యం సత్యవంతునికి గాని, అత్తమామలకు గాని తెలియదు. ప్రేమ పిపాసతో దానిని మరచిపోదామని ప్రయత్నించింది. సత్యవంతుని ఆలింగనాలు, ప్రేమ ఆమె లోపలి గాయాల్ని మాన్చలేదు. రోజులు గడుస్తున్నాయి. క్షణకాలం వియోగం కూడా దుర్భరం అనిపిస్తోంది. ఆమె ఉద్విగ్నతను సత్యవంతుడు గ్రహించలేదు.

ఆమె తృప్తి కోసం తను చేయగలిగినంత చేస్తున్నాడు. ఆమె సన్నిధి వదలడు. ఆమె ఆలోచనలు వేరు. సత్యవంతుడు మరణించగానే తాను సహగమనం చేసి పరలోకాలకు వెళ్లడమా! అక్కడ స్వర్గంలో ఇంతకు మించిన సుఖాలు అనుభవించవచ్చునా? భౌతిక శరీరాలలో సుఖించడంలో ఉన్న తృప్తి సూక్ష్మశరీరాలు సుఖించడంలో ఉండదు. ఇంద్రియాలు లేని సుఖంలో ఇంద్రియ సుఖం ఉండదు! అతీంద్రియ సుఖాల పరమార్థం వేరు.

చేసిన పాపాలకు ఫలితం మృత్యువు కాకూడదు. పుణ్యం చేసినవారూ మరణిస్తారు. మనిషి పరిస్థితులకు బానిస, కర్మకు బద్ధుడు. మృత్యువు, కామం, నిస్సహాయత మనిషిని క్రుంగదీస్తాయి. అజ్ఞాన స్థితి నుండి జ్ఞానస్థితి వరకు ఉన్నది మానవతే. మనిషి స్వప్రయత్నం వల్ల కర్మబంధం నుండి తప్పించుకొను వీలున్నది. విధిని సైతం దాటి పోగల అవకాశం ఉంది.

**దృష్టి** అనినంత వరకు విధి ఆమెను వెన్నాడింది –

మనిషి ఆశలు, ఆశయాలు అతని లక్ష్యానికి అనుగుణంగానూ, గమ్యానికి చేర్చేవిగానూ అనిపిస్తాయి. విధి అతని చర్యలను రూపుదిద్దుతుంది. సంకల్పం జీవితాన్ని గుడ్డిగా నడిపిస్తుంది. దానికి అనుగుణంగానే బుద్ధి పనిచేస్తుంది. వీటి మూలాలు ఆత్మలో రహస్యంగా ఉంటాయి. అవి అమూల్యాలు. భౌతిక శరీరానికి పంచభూతాలు ఆధారం. వాటి స్వభావానికి, అవసరాలకు అనుకూలంగానే ఆత్మ చరిస్తుంది. ప్రకృతి, కర్మ మనిషి సంకల్పాన్ని మార్చుతుంటాయి.

మహాత్ములు ఈ కార్యక్రమాన్ని తమకు అనుకూలంగా మార్చుకోగలరు. మహాత్ములైన వారి ఆత్మలు విధిని మార్చి తీర్చి దిద్దుకోగలవు. సత్యం ముందు అజ్ఞానం వీగిపోతుంది. పుట్టుకతో ఏర్పడిన బుద్ధులు పుడకలతో గాని నశించవు. మనిషి కష్టాలు, బాధలు జీవుడు ఇక్కడ కల్పించేవి. ప్రతి పనికి, ఫలితానికి కార్య కారణ సంబంధం ఉంటుంది.

సావిత్రికి లోకరీతులు, లౌకికాలు, రివాజులు తెలుసు. ఆమె మనసు మెత్తన. హృదయం కఠినం. అనంత ప్రేమరూపిణి. కృతనిశ్చయంతో, స్వశక్తితో, సృష్టిని మలుపు తిప్పాలని సంకల్పించింది. తిరిగి రథాన్ని అధిరోహించి బయల్దేరింది. వెంట సహాయంగా వచ్చిన సైనికుల రథాలు అక్కడే ఆగిపోయాయి. ఆమె మనోరథం మాత్రం ఒంటరిగా ముందుకు సాగింది. మగతగా నిద్రిస్తున్న వసుధ ఎదలో చైతన్యం కదలాడింది. వసుంధర మేల్కొన్నది. రథవేగానికి భూమి దద్దరిల్లింది. భూదేవి ఆమె ఆ వేగాన్ని ఆమోదించింది. ఆమె ఆవేదన పుడమి తల్లికి తెలుసు.

ఆకాశం పందిరి క్రింద విస్తరించిన వేసవి భూముల్ని దాటింది. మండు టెండల్లో కాలిపోతున్న పర్వతాలను దాటింది. నదీతీరాలు, సుక్షేత్రాలు, పసిరిక బయళ్లు దాటింది. చంద్రకాంతిలో మెరిసే నగరాలను దాటింది. సింహాలు సంచరించే దుర్గమారణ్యాలు దాటింది. కడకు సాళ్వదేశ సరిహద్దులలోని అభయారణ్యం చేరుకుంది. అవి ఆనందం గూడు కట్టుకున్న మరుభూములు.

# 24. నిర్వాణం

*యోగారూఢంలో సావిత్రి పొందిన తొలి ఫలాలు ఆనందం, శాంతి, శక్తి. భావాతీతస్థితికి చేరినా ప్రపంచ స్పృహ పోలేదు. సత్యవంతుని తోడి సాహచర్యం జీవితానికి పరమార్థం ప్రణయార్థం చూపింది. సత్యవంతుడు మృత్యుద్వారం వద్ద ఉన్నా అది మృత్యుద్వారం కాదు. మరో లోకానికి బంగారు వాకిలి. అది ప్రేమ చొరరాని లోకం. ప్రేమానుభవం జీవితంలో సుఖానికి ఆనందానికి చివరి మజిలీ. తర్వాత అంతా శూన్యం. సావిత్రి శూన్యంలో ఆత్మను అన్వేషించపూనుకున్నది. తనను తాను తెలుసుకోవడంతో తన శక్తిని కోల్పోయింది. ఇప్పుడు పరాశక్తి అవసరం. మనస్సును శూన్యం చేసుకున్న తర్వాతనే తానేమిటో తెలిసింది. ఒకేసారి మనిషి రెండు స్థితుల్ని పొందలేడు. బాహ్య ప్రపంచం వేరు, అంతర్లోకాలు వేరు. ఒకటి భౌతికం, ఒకటి ఆత్మికం.*

*సావిత్రి వెనుతిరిగి చూచింది. జీవితం కల్లోలం– మనస్సు చంచలం– భావాలు సంకుచితం. అదీ ప్రపంచం. ఆలోచనలు మెదడులో పుడతాయా, రోదసిలో ఏర్పడుతున్నాయా? ఆమెలోని ప్రతి అణువు ఒక భావచిత్రం అయింది. సామాన్య మానవునికి తెలియని సత్యం ఆమెకు అవగతమైంది. కనుక ఆమె స్వతంత్రంగా ఆత్మ మందిరంలో ప్రవేశించ గలిగింది. మనిషి మేధ ఒక యంత్రం లాంటిది. అది ఆగిపోయింది. ఆమె పైస్థితికి చేరింది. అది సాధన వల్ల ఏర్పడే ప్రశాంత ధ్యానస్థితి. మానసిక వ్యాపారం అసలు లేకుండా పోవాలి. శరీరం జడం కావాలి. అప్పుడు లోపల ఎక్కడో ఒక భావం కదలాడుతుంది. దానిని గుర్తించకపోతే సమసిపోతుంది. ఆలోచన చెదిరినా, శరీరం కదలినా తెలియదు. ద్వంద్వాలకు అతీతమైన స్థితి. ఆమె సృష్టి కడపటి అంచుకు చేరింది. అదే నిర్వాణ స్థితి, నిర్గుణ స్థితి.*

**నిర్మలాకాశం** నుండి సూర్యకిరణాలు తొంగిచూచాయి. ముసిరిన మేఘాలు చెదరిపోగా, వర్షం కడసారి అరణ్యాన్ని పలకరించిపోయింది. ఉండి

ఉడిగీ చెట్లచాటున చిరుసవ్వడి వినిపిస్తోంది. ఆకాశం క్రమంగా నీలి పరదాలను పరుచుకుని తన ఆనందాన్ని వ్యక్తం చేసింది. తుఫాను నిర్దయగా మింగిన అరణ్య శోభలు పగటి వేడికి ముస్తాబు చేసుకోసాగాయి. శారద చంద్రికలలో నలిగిన అందాలు గాలి కెరటాలకు ఊగి తూగుతున్నాయి.

భూదేవి వలె సావిత్రి నిండుగా ఉంది. ఆనందంతో తొణికిసలాడుతోంది. తనను తాను తెలుసుకున్నది. తన లక్ష్యాన్ని గుర్తించింది. అంతరంగం మహత్తర పరిణామానికి లోనైంది. అది హృదయగతం. బయటకు కనిపించదు. చుట్టూ ఉన్న లోకంపై దాని ప్రభావం సోకుతుంది. ఆ రహస్యాన్ని చెట్లు గుసగుసలాడాయి. గాలులు మోసుకెళ్లాయి. పుష్పాలు వెర్రి ఆనందంతో ఊగిపోతున్నాయి. పక్షులు సైతం ఆనందాతిరేకంతో పరుగులు పెడుతున్నాయి. వన్యమృగాలు సైతం తమ వైరం మరచి సఖ్యంగా ఉన్నాయి.

అరణ్యంలో చిరకాలంగా తపస్సు చేసుకుంటున్న మునులు బ్రహ్మానందాన్ని అనుభవించసాగారు. వారికి తమ తపస్సు ఫలించిందన్న అనుభూతి కలిగింది. ఆమె అంతరంగం యోగపూర్ణమై, తేజస్సు నింపుకుని పొంగి, పొరలి, బాహ్యప్రపంచాన్ని పునీతం చేయసాగింది. నిస్తేజంగా ఉన్న ప్రకృతి, పరిసరాలు సుందరంగా మారి ప్రతిక్షణం దివ్యంగా మార్చుకోసాగాయి. ప్రతి చిన్నపని మహత్తరంగా, ఆనందకరంగా మారసాగింది.

లోకంలో ఆత్మ నివేదనలన్నీ పరమాత్మకే చెందుతాయి. ఒక కాంతిరేఖ తేజస్సుగా మారి సర్వ ప్రపంచాన్ని చుట్టివేసింది. హృదయంలో సచ్చిదానందం చిప్పిలసాగింది. ఆమె స్పర్శకు విషాదం సైతం ఆనందంగా మారింది. సత్యవంతుని తల చుట్టూ విధి కప్పిన చీకటి ముసుగు ఆమెకు కనిపించలేదు. ఆ ముసుగులో మృత్యువు దాగి ఉన్నదని తెలియలేదు. అది తేజోవలయం అని భ్రమించింది. ఆ సువర్ణ కాంతివలయంపైకి తన దృష్టిని సారించింది. అది జీవుని పవిత్రతకు చిహ్నం. దివ్యత్వానికి సంకేతం. ఆమె స్వప్నాలు, భావాలు కరిగిపోయాయి. భవిష్యత్తుపై పరచుకున్న ఆచ్ఛాదన తొలగిపోయింది.

సత్యవంతుడు ఇప్పుడు విషాదానికి ప్రతిరూపం కాదు. మృత్యువు అతనిని కబళించలేదు. అతను ఆమెకు దూరమై ఆనందతీరాలకు చేరుకున్నాడు. ప్రాపంచిక మాధుర్యాలు, సుఖాలు అతనికి జ్ఞప్తి లేవు. గాఢోపగూహన ప్రణయ పారవశ్యం లేదు. ఆత్మానందంలో అమరసుఖాలు అనుభవిస్తున్నాడు. నిజానికి అతని ఆత్మ

# 29. పరనిర్వాణం

*సావిత్రి సత్యవంతుల ఆత్మలు మృత్యువుతో కలిసి పయనిస్తూనే ఉన్నాయి. ఆమె మృత్యువు బెదిరింపులకు లొంగలేదు. మాటకు మాట సమాధానం చెప్పింది, వాదించింది. ప్రయోజనం ఏమిటి? తిరిగి సత్య వంతుని పొందలేదు. మృత్యువును జయించినట్లు కాదు. ఆమె తిరిగి భూలోకానికి వెళ్లిపోనూ లేదు. సత్యాన్ని దర్శిస్తే మృత్యువును జయించినట్లు. ఇక్కడ మృత్యువు సత్యదర్శనానికి అడ్డుగా ఉంది. అంధకారం తేజస్సును కనిపించనీయటం లేదు. వెలుగు బయటకొస్తే చీకటి పటాపంచలవుతుంది.*

*ఆ నిశిని మండించగల హిరణ్యజ్యోతి ఒకటి కనిపించింది. అంధకారం కలవరపడ్డది. జ్ఞానోదయం అయ్యే అవకాశం కనిపిస్తుంది. సావిత్రిలో ఒక ఆనంద రేఖ పొడచూపింది. అది ఒక స్వర్గం, ఒక ఆనంద లోకం.*

*మృత్యువు అజ్ఞానానికి ప్రతినిధి. జ్ఞానికి మృత్యుబాధ ఉండదు, మరణించడం జరుగుతుంది. మరణం తర్వాత దివ్యలోకాలకో, సత్యలోకాలకో వెళ్లడం పుణ్యాత్ముల సుకృతఫలం. సావిత్రిని ఎలా ఒప్పించాలో మృత్యువుకు తెలియలేదు. వరాలివ్వడం జరిగిపోయింది. వరం పొందడం తన హక్కుగా ఆమె భావించింది. స్వీకరించింది. అది మృత్యువు పరాజయంలో తొలి అధ్యాయం.*

**చుట్టూ** భయంకరమైన చీకటి. గాఢమైన నిశ్శబ్దం. రవంత మార్పు లేదు. మారుతుందన్న ఆశ లేదు. మహాశూన్యానికి ఆకరమైన ఆ చిమ్మచీకటి స్వప్నభ్రాంతి కలిగిస్తోంది. ఎంత దూరం గమించినా ఎక్కడికి చేరడమో తెలియదు. అది అగమ్య ప్రయాణం. ఒక లక్ష్యం, గమ్యం లేకుండా ముగ్గురూ కదులుతున్నారు. చీకటి మరింత దట్టమైంది. భయం మరింత పెరిగింది. జీవి మనడానికి వీలులేని చోట, అరూప, అగోచర, అగమ్య, అంధకారంలో సాగిపోతున్నారు.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Andhra+Maha+Savitri**

* * *